పచ్చదనం.. ఆరోగ్య భాగ్యం

- మురళీనగర్ పార్కుల్లో ఆధునిక సౌకర్యాలు
- వ్యాయామం, వాకింగ్, ఆటలతో కళకళ
- సందర్శకుల మదిని దోచేలా నిర్వహణ


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆధునిక వాకింగ్ ట్రాక్‌పై నడుస్తున్న వాకర్స్


స్విమ్మింగ్ పూల్‌లో ఈతగాళ్ల సందడి


మురళీనగర్ వైశాఖి పార్కులో బ్యాడ్మింటన్ ఆడుతున్న చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ పేరు చెప్పగానే అందరికీ ఠక్కున గుర్తుకొచ్చేవి అందమైన పార్కులు. ఈ ప్రాంతం పర్యావరణ పరిరక్షణకు.. మానసిక ప్రశాంతతకు ప్రత్యేక నిలయంగా వర్ధిల్లుతోంది. ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నాయి. దీంతో ఇక్కడి పార్కులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వారి అభిరుచికి తగ్గట్టు ఉద్యానవనాలను తీర్చిదిద్దుతున్నారు. ఎప్పటికప్పుడు ఆధునిక సౌకర్యాలను స్థానిక ప్రజలకు, వాకర్స్‌కు అందుబాటులోకి తెస్తున్నారు. ఇటీవల కాలంలో వివిధ పార్కుల్లో అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి వారి అభిమానాన్ని చూరగొన్నారు. దీంతో పార్కుల నిర్వాహకులను అందరూ అభినందిస్తున్నారు.

వైశాఖి పార్కులో ఆధునిక వాకింగ్ ట్రాక్

వైశాఖి స్పోర్ట్స్ పార్కు పచ్చదనం, ఆహ్లాదానికి పెట్టింది పేరు. ఇక్కడి పాలక వర్గం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన సౌకర్యాలను కల్పించింది. ముఖ్యంగా ఈ పార్కులో నగరంలోనే ఆధునిక వాకింగ్ ట్రాక్‌ను తీర్చిదిద్దారు. సుమారు రూ.2 లక్షలతో గులకరాళ్లు, దిగువ రంపపు పొట్టు, పైన కంకరమట్టితోపాటు ఇసుకను ఉపయోగించి దీన్ని తయారు చేశారు. నడిచే వారికి ఎటువంటి కీళ్ల సమస్యలు రాకుండా ఈ ట్రాక్‌ను రూపొందించారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి సూర్యనారాయణరాజుల పర్యవేక్షణలో దీన్ని తీర్చిదిద్ది ఇటీవల ప్రారంభించారు. దీంతో వాకర్స్ సంఖ్య పెరిగింది.

సీసీ కెమెరాల ఏర్పాటు

వైశాఖి స్పోర్ట్స్ పార్కుకు అనుబంధంగా ఉన్న స్విమ్మింగ్ పూల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. స్విమ్మింగ్ పూల్‌లో ప్రవేశానికి అందరికీ అందుబాటులో ఉండేలా నెలకు కేవలం రూ.700 మాత్రమే తీసుకుంటున్నారు. మహిళల కోసం ప్రత్యేక కోచ్‌ను నియమించారు. క్రీడా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

వాకర్స్ పార్కులో విశాల ప్రాంగణం

వాకర్స్ పార్కులో ఇప్పటికే అనేక సౌకర్యాలు కల్పించగా నూతనంగా విశాలమైన ప్రాంగణాన్ని నిర్మించారు. దీని చివర బెంచీలు ఏర్పాటు చేసి సందర్శకుల విశ్రాంతికి అందుబాటులోకి తెచ్చారు. వాకర్స్‌కు మినరల్ వాటర్ అందిస్తున్నారు. మ్యూజిక్ సిస్టమ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది.

సుదర్శన్ పార్కులో నూతన వెలుగులు

సుదర్శన్ పార్కులో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుల సహకారంతో రూ.19.50 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించారు. ముఖ్యంగా ఆధునిక పాత్‌వే నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆటపరికరాలను సందర్శకులు సద్వినియోగం చేసుకుంటున్నారు. పార్కు నిర్వహణ కమిటీ సభ్యులు కూడా మరికొన్ని విరాళాలు అందించి బెంచీలను ఆధునికంగా తీర్చిదిద్ది ఫ్లాట్‌ఫారాలు ఏర్పాటు చేశారు.


వాకర్స్ పార్కులో విశాలమైన ప్రాంగణం


సుదర్శన్ పార్కులో ఆధునిక పాత్‌వే

సందర్శకులకు అనుగుణంగా సౌకర్యాలు



మా పార్కులో సందర్శకులకు అనుగుణంగా సౌకర్యాలు కలిస్తున్నాం. నగరంలోని అన్ని పార్కుల కన్నా మా పార్కు ఆదర్శంగా నిలుస్తుంది. రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ఎనర్జీతో నడిచే పార్కుగా తీర్చిదిద్దాం. అన్ని వయసుల వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలనేది మా ధ్యేయం. అందుకనుగుణంగా పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం.

– సనపల వరప్రసాద్, వైశాఖి స్పోర్ట్స్‌పార్కు అధ్యక్షుడు

పార్కును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం



పార్కులో నిత్యం పచ్చదనం శోభిల్లాలన్నదే మా ధ్యేయం. మురళీనగర్‌లోనే మొట్టమొదటి పార్కుగా పేరున్న మా పార్కును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. విజ్ఞానం, వినోదాలకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వైద్య శిబిరాలు నెలకు కనీసం ఒకటి నిర్వహిస్తాం. ఈసీజీ, ఎకో–2డీ లాంటి ఖరీదైన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తుంటాం.

– పల్లా చంద్రమౌళి, వాకర్స్ పార్కు అధ్యక్షుడు

సీసీ టీవీ ప్రారంభం


పార్కు కార్యాలయంలో సీసీ టీవీని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

మురళీనగర్: స్థానిక వైశాఖీ స్పోర్ట్స్ పార్కుకు అనుబంధంగా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను ఆదివారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. నిర్వహణ తీరును తెలుసుకుని కమిటీ సభ్యులను ప్రశంసించారు. నగరంలోనే అతి తక్కువ ఫీజుతో స్విమ్మింగ్ పూల్‌ను నిర్వహిస్తున్నట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా సీసీ టీవీని సీపీ ప్రారంభించారు. పార్కులో నడక మార్గాన్ని, కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.

ఆడపిల్లల ఆరోగ్యంపై తల్లులు శ్రద్ధ వహించాలి

అల్లిపురం: ఆడపిల్లల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ బి.సౌదామిని సూచించారు. ముఖ్యంగా ఆడవాళ్లు ఇంట్లో పనులతోపాటు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి గౌరీపరమేశ్వరుల చిత్రపటం వద్ద దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమెను గ్రంథాలయ మహిళలు సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌదామిని మాట్లాడుతూ తల్లులు తమ పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలన్నారు. వారిలో వచ్చే మార్పులు గమనిస్తూ, వారికి పౌష్టికాహారం అందజేయాలన్నారు. పిల్లలతో పాటు మహిళలు కూడా వారి వయసు రీత్యా కాల్షియం, విటమిన్–డి తీసుకోవాలన్నారు. అనంతరం మహిళలను పరిశీలించి వారికి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేసి హారతి సమర్పిస్తున్న పూజారమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ అష్టమి సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

నందగిరినగర్‌లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

తాటిచెట్లపాలెం: నందగిరినగర్‌లో ఆదివారం లక్ష్మీగాయత్రి హాస్పిటల్ సౌజన్యంతో నందగిరినగర్ సేవా సంఘం వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీగాయత్రి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ ప్రాంతాల్లో పేదల కోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీలోని సుమారు 100 మందికి బీపీ, సుగర్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, నందగిరినగర్ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు జయకుమార్, అధ్యక్షుడు బొడ్డేటి ప్రకాష్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, సెక్రటరీ బసవ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెం గ్రామాభివృద్ధికి కృషి చేస్తా..


నక్కవానిపాలెం గ్రామ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

సీతమ్మధార: నక్కవానిపాలెం గ్రామాభివృద్ధికి నూతన కమిటీ ఆధ్వర్యంలో కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గుడ్ల కాటరాజు రెడ్డి తెలిపారు. నక్కవానిపాలెం గ్రామ కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిటీతో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. అధ్యక్షుడిగా గుడ్ల కాటరాజురెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.డ్రెడ్ల వెంకటేశులు, బోర రవికుమార్‌రెడ్డి, కార్యదర్శిగా కారపు శ్యామలారావు, నందిక వేణురెడ్డి, కోశాధికారిగా ధర్మాల గురుమూర్తిరెడ్డి, జాయింట్ క్యాషియర్‌గా నక్క రమేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎలక్షన్ కమిటీ సభ్యులు నక్క అప్పలరెడ్డి, దుండి రాజేష్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, నక్క కన్నారావు, నక్క భాస్కరరెడ్డి, పూతి వెంకటరెడ్డి, చింతపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో ముగిసిన వారాహి ఉత్సవాలు


శాకంబరి అలంకరణలో అమ్మవారు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిదో రోజు శాకంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గౌరీ సేవా సమితి కొత్త కార్యవర్గం


గౌరీ సేవా సమితి నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం శ్రీగౌరీ సంక్షేమ సేవా సమితి వార్షిక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2024–2026 కాలపరిమితికి నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కాండ్రేగుల సూర్యనారాయణ, డి.కె. ఎ.సత్యనారాయణ, పి.రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమితి నూతన అధ్యక్షుడిగా పిల్లా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా కాళ్ల వెంకట్‌ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా కొణతాల రమణప్రసాద్, కోశాధికారిగా వేగి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రాపేటి రామారావు, బి.వి. సత్యనారాయణ, రాపేటి వెంకటరమణ, ఆళ్ల నూక అప్పారావు, పి.సుధాకర్, భీమరశెట్టి రామకృష్ణ, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అలరించిన హాస్య నాటిక


హాస్య నాటికలోని ఓ సన్నివేశం

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన 'పుటుక్కు జర..జర.. డుబుక్కు మే' హాస్య నాటిక కడుపుబ్బా నవ్వించింది. పాత్రధారుల హాస్య ప్రదర్శన అలరించింది. ఎం.దివాకర్‌బాబు రచించిన ఈ నాటికకు పి.శివప్రసాద్ దర్శకత్వం వహించారు. మాచిరాజు నారాయణరావు నిర్వహణలో పి.ఎల్.వి.ప్రసాద్(ప్రసాదం), డి.వి.ఆర్ మూర్తి (రామనాథం), పి.చెల్వరాజు(కాశీపతి), ఎం.చంద్రరావు(వెంకుబాబు), ఈటి రాంబాబు(చాకలి), జి.మాధవీలత(జానకి) పాత్రధారులుగా నటించి మెప్పించారు. ఎస్.వి.రమణారావు(మేకప్), సత్యనారాయణ సంగీతం, టి.అప్పారావు రంగాలంకరణ చేశారు. ముందుగా పార్కులో నూతనంగా నిర్మించిన సభా ప్రాంగణాన్ని ప్రారంభించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఇతర సభ్యులు ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పరమాత్ముని దయతోనే జీవన్ముక్తి


సందేశమిస్తున్న సద్గురు మాతా సుదీక్షా సత్య

డాబాగార్డెన్స్: పాతనగరంలో ఆదివారం సంత్ నిరంకారీ మిషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంత్ సమాగం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి మోహినీ అహుజా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుంచే కాక తూర్పు, పశ్చిమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, సంత్ నిరంకారీ మిషన్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాగంలో పలువురు మహిళలు లఘు నాటికలు, కవితలు, నృత్య గానాలు, బృందగానాలు, ఉపన్యాసాలిచ్చారు. అనంతరం సంత్ నిరంకారీ మిషన్ సద్గురు మాతా సుదీక్షా సత్య తెలుగు, హిందీ, మరాఠి, ఒరియా, పంజాబీ, భోజ్‌భాషల్లో ప్రసంగించారు. మానవ జీవిత లక్ష్యం, ప్రభు ప్రాప్తి, బ్రహ్మజ్ఞాన ఉపదేశాలకు సంబంధించి తెలిపారు. నేను ఎక్కడి నుంచి వచ్చాను.. ఎక్కడికి వెళ్లగలను అనే సత్యం గ్రహించి సద్గురు ద్వారా బ్రహ్మజ్ఞానం పొందాలన్నారు. పరమాత్మతో అనుసంధానమైన నామస్మరణ ద్వారా నిరంకారునితో యోగమై పరమాత్మునితో జీవించి జీవన ముక్తి పొందాలన్నారు. సంత్ సమాగంలో ప్రేమ్ రాంచంద్, పీవీ రావు, పీఎస్ఎన్ రాజు, రాజ్‌వీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పెన్షనర్ల కృషి


మాట్లాడుతున్న చౌదరి అప్పారావు

మద్రిపాలెం: కళింగనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కానివ్వకుండా పింఛన్‌దారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒక రోజు సమ్మె చేయాలన్నారు. పోర్టు పింఛన్‌దారులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, ఫొటో గుర్తింపు కార్డులను తక్షణమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.శివప్రకాశరావు, అన్నెపు నారాయణరావు, రెహమాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాల తొలగింపు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో దుకాణాల ముందు నిలిపిన వాహనాలను తొలగించిన ట్రాఫిక్ పోలీస్

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలోని దుకాణాల వద్ద ఇష్టానుసారంగా పార్క్‌చేసిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. ఫుట్‌పాతులపై ఉన్న దుకాణాల బోర్డులు తొలగించారు. ఈ ప్రాంతంలో వాహనాల రాంగ్ పార్కింగ్ వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై 'పోలీసుల హెచ్చరికలు బేఖాతర్' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వార్త వెలువడింది. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ద్వారకా జోన్ పోలీసులు తక్షణం స్పందించి రాంగ్ పార్కింగ్ వాహనాలను ఖాళీ చేయించారు. రోడ్డుపై వాహనాలు నిలిపివేయరాదని దుకాణదారులకు సూచించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

పాత నేరస్తులకు ఈస్ట్ క్రైం ఏసీపీ హెచ్చరిక


పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ రమేష్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం పాత నేరస్తులకు ఈస్ట్ క్రైం ఏసీపీ వెంకటరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల దినచర్య, సత్ప్రవర్తనతో ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు ఉన్న వారి వివరాలను సేకరించారు. తగాదాలు, గొడవల్లో తలదూర్చకుండా ఉండాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాల జోలికి పోకూడదన్నారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు చేసే పనులపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని చెప్పారు. రాత్రిళ్లు తిరిగినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెడు మార్గాన్ని విడనాడి మంచిగా నడుచుకోవాలని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్, క్రైం ఎస్ఐలు భాస్కరరావు, రాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'మొల్ల రామాయణం' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: విశాఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య కోలవెన్ను మలయవాసిని రచించిన, తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో జరిగింది. డాక్టర్ ఈదర పెద వీర్రాజు చేతుల మీదుగా ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడిన ఎందరో కవుల్లో మొల్ల కూడా ఒకరని, ఆమె ఒక మహిళై ఉండి కూడా ఆనాటి పురుషాధిక్య సమాజంలో రామాయణాన్ని రచించడం సాహసోపేతమైన చర్యని కొనియాడారు. గ్రంథ రచయిత కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహిళల్లో మొట్టమొదటి రచయిత్రిగా మొల్ల రామాయణాన్ని రచించారని, ఇటువంటి గ్రంథానికి వ్యాఖ్యాన గ్రంథం ఉండాలనే సంకల్పంతో ఈ రచనకు పూనుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, డి.వి.సూర్యారావు, శంకర్ నీలు భాగవతుల సభ్యులు గండికోట విశ్వనాథం, అన్నవరపు శ్రీనివాసరావు, సాయిబాల, ఎ.వి.జోగారావు, సిహెచ్.సూర్యనారాయణ, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

- గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన


తొలిపావంచా వద్ద చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

సింహాచలం: గిరి ప్రదక్షిణ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా భక్తులు బయలు దేరే కొండదిగువ శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలసి నార్త్ ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. భక్తులు తొలిపావంచా వద్దే కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దీంతో ఆప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన క్యూలు, భక్తుల మధ్య తోపులాటలు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కొబ్బరికాయలు కొట్టేందుకు ఎన్ని ర్యాంపులు వేయాలో పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ స్పోర్ట్స్ మీట్ ట్రయల్స్ ప్రారంభం


కైలాసగిరి పోలీస్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ ట్రయల్ ప్రారంభిస్తున్న జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్

ఆరిలోవ: ఏపీఎస్ ఆర్టీసీ జోన్–1 ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ మీట్ ట్రయల్‌ను ఆదివారం జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్ ట్రయల్స్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు, బి.అప్పలనాయుడు, కె.వి.రావు, సత్యనారాయణ, సుధాబిందు పాల్గొన్నారు.